క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



గన్నవరం: ఆరోగ్య రక్షణ కోసం ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల డాక్టర్ సి. అంజనీకుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న యువ జన వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇండి యన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత–ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం, జీవన శైలిలో మార్పులు వ్యాధులను దూరం చేస్తాయని తెలిపారు. యుక్త వయస్సు నుంచి మంచి ఆరోగ్య, ఆహార జాగ్రత్తలు పాటిం చడం వల్ల ప్రశాంతమైన జీవనం గడపవచ్చాని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి, సొసైటీ గన్నవరం శాఖ చైర్మన్ చిన్ని మాధవీ, కళాశాల అధ్యాపకులు వీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మం డలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం సచివాల యం–1లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కీళ్లవాతం, గ్యాస్ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మవ్యాధులకు సంబంధించిన రోగులను పరీక్షించి 27 మందికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కె. సునీత మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శనివారం ఈ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులను పరీక్షించి ఉచిత మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. నిత్యం యోగాసనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. యోగ శిక్షకులను నియమించి ఉచితంగా యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. సిబ్బంది కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, యోగ టీచర్ స్వాతి పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం కోడి పందేలు నిర్వహిస్తున్నారని యనమలకుదురుకు చెందిన బాణావత్ అర్జున్, కొక్కిలిగడ్డ సందీప్, అజ్మీరసాయికుమార్, బాణావత్ అర్జున్ మచిలీపట్నం గిలకలదిండికి చెందిన వి.నరేంద్రపై పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

గన్నవరం రూరల్: దోమల నివారణకు ప్రతి సచివాలయం పరిధిలో వైద్య ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ ప్రసాద్ సూచించారు. శనివారం పీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన నిర్వహిస్తూ సచివాలయం వలంటీర్లతో మలేరియా సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశాలు సమన్వయం చేసుకుని ఇళ్లల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలు, ఆ నీటిని పారబోయాలని చెప్పారు. ఈ మేరకు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను వివరిస్తూ వాటర్ డ్రమ్ములు, రుబ్బు రోళ్లు, పాత టైర్లు తదితర ప్రాంతాల్లో దోమలు గుడ్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించాలి

గన్నవరం రూరల్: మండలంలో రెండో పంట సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజశ్వి చెప్పారు. శనివారం ఆమె మాట్లాడుతూ పలు గ్రామాల్లో ఇప్పటికే పంట నూర్పుడులు పూర్తి చేశారని, వారు రెండో పంటగా పలు రకాలైన వ్యవసాయ ఉత్పత్తులు సాగు చేస్తున్నారన్నారు. సాగు చేసే పంట ఏదైనా దానిని ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. దీంతో వారికి ప్రభుత్వం అందించే ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని చెప్పారు. వివరాల కోసం గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

సేవాభావం ఉండాలి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని లింగయాస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్.రాజలింగ్ అన్నారు. నున్న గ్రామంలోని మదర్‌థెరిస్సా ఆశ్రమంలోని అనాథపిల్లలకు, వృద్ధులకు లింగయాస్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు పండ్లు, స్వీట్లు శనివారం పంపిణీ చేశారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు సామాజిక సేవలో భాగంగా కృతజ్ఞత కలిగి ఉండడం అనే అంశంపై విద్యార్థులకు ప్రాక్టికల్ నిర్వహించినట్లు అధ్యాపకురాలు ప్రొఫెసర్ సుజాత తెలియజేశారు. నిత్యావసర వస్తువులను ఆశ్రమం నిర్వాహకులకు అందజేశారు. విద్యార్థులకు విలువలతో కూడిన బోధన ద్వారా వారికి మానవ సంబంధాల గురించి తెలియపర్చడం అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో సచివాలయం–3, సచివాలయం–2 పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకి ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, సర్పంచ్ శీలం రంగారావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ రామానగర్‌లో అంతర్గత రహదారి నిర్మాణం నిమిత్తం శంకుస్థాపన చేశారు. గ్రామంలో నిర్వహించాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురుకు విద్య, వైద్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సంభందించి వంశీ తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం అందజేశారు. తొలుత సచివాలయం–3లో అధికారుల బృందం కలిసి వంశీ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. మధ్యాహ్నం నుంచి సచివాలయం–2లో పర్యటించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్లు అందడం లేదని, ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని వంశీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలో పింఛన్లు 1,335 ఉండగా కొత్తగా 49 మంజూరైనట్లు ఎమ్మెల్యే వంశీకి వివరించారు. అలాగే ఇళ్ల స్థలాలు మొత్తం 937 మంజూరయ్యాయని పేర్కొన్నారు. సుమారు 350 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగన్‌మోహన్ రెడ్డి రెండోసారి సీఎం అవ్వడాన్ని ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రజల్ని మభ్య పెట్టేందుకు ప్రతి పక్షాల నాయకులు అనేక కుట్రలు పన్నుతున్నారన్నారు. వీటిని ప్రజలే తిప్పి కొడుతున్నారన్నారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల్ని మభ్య పెట్టేందుకు బహిరంగ సభలు, సమావేశాలంటూ అమాయకపు ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీటీఓ శేషగిరిరావు, పంచాయతీ రాజ్ ఏఈ శివరామకృష్ణ, ఆర్ఐ రాజ్‌సింగ్, విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు, ఎనికేపాడు, రామవరప్పాడు సర్పంచ్‌లు రాచమళ్ల పూర్ణచంద్రరావు, వరి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, పలు గ్రామాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలు విజయవంతం చేయాలి

ఈ నెల 13,14 తేదీల్లో గన్నవరం జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో నిర్వహించబోయే హ్యాండ్ బాల్ పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వంశీ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి గ్రామ సచివాలయంలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను వంశీ ఆవిష్కరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు

సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుధారాణి



మొక్కజొన్నలో యాజమాన్య చర్యలపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ సుధారాణి

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని దావులూరులో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు, సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. సుధారాణి మాట్లాడుతూ వరి మాగాణిలో మొక్కజొన్న సాగు చేసిన పొలాల్లో ఎరువులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. కత్తెర పురుగు, పొగాకు లద్దె పురుగు ఉధృతిని గుర్తించామన్నారు. నివారణకు రైతులు త్రేసర్/స్పైనోసైడ్ 60 మిల్లీలీటర్లు ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. స్పినోతోరం 60 మిల్లీలీటర్లు ఎకరాకు వేపనూనె ఒక లీటరుతో కలిపి మొవ్వు తడిసేలా పిచికారీ చేస్తే ఆశించిన ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ పీఎం కిరణ్ పాల్గొన్నారు.

వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: భార్యను వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు యనమలకుదురు డొంక రోడ్డు కనకదుర్గనగర్‌లో ఉంటున్న కొరిని భారతి సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీనియర్ ఎనలిస్టుగా పని చేస్తోంది. తెలుగు మేట్రిమోనిలో సంబంధం రావడంతో చెన్నై రైల్వేలో పని చేస్తున్న నేతింటి రామకృష్ణ 2021 సంవత్సరంలో భారతిని వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. భర్త అదనపుకట్నం కావాలని భార్యను వేధించసాగాడు. పైగా భారతి ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె భర్త పై వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు పోరంకి గ్రామానికి చెందిన కె.సింహాచలం 2016 సంవత్సరంలో అపార్టుమెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న మాణిక్యాన్ని వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. అయితే భర్త అదనపుకట్నం కోసం భార్యను తరచుగా వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె భర్తతో పాటు అత్త ప్రభావతి, మామ సుబ్బారావు, బావ ప్రసాద్‌పై వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

సంక్రాంతి వేడుకలు



భోగి మంట వేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ టీవీ సతీష్

కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పర్వదినాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి నిర్వహించారు. భోగిమంటలను ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, తహసీల్దార్ టీవీ సతీష్ భోగిమంట వేసి, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలన్నారు. చిన్న నాటి నుంచే పర్వదినాలు, వాటి ప్రాధాన్యతలు తెలుసుకుని, నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ డెలివరీ విషయమై జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ విజయవాడ రూరల్ మండలం పి.నైనవరంలో శ్రీసత్యనారాయణ రైస్, ఫ్లోర్ మిల్, శ్రీసత్య గాయత్రిరైస్ మిల్లులను శనివారం తనిఖీ చేశారు. మిల్లులలో ఇప్పటి వరకు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, మిల్లులు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం వివరాలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. మిల్లుల వారిని త్వరితగతిన సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సిందిగాను, ఇంకనూ ఎక్కువ మొత్తంలో బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలని ఆదేశించారు. మిల్లుల వారు వారి వద్దకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా బట్టీలలో పోసుకుని, ఖాళీ గోనె సంచులను అవసరమైన ఆర్‌బీకేలకు తరలించాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా త్వరితగతిన దిగుమతి చేసుకోవాలి సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 56వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా సేకరించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, కస్టోడియన్ శరత్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నున్న గ్రామంలోని ఇద్దరు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించారు. రంగు రేణుక, ఏర్వా నాగలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు వీరికి వరుసగా రూ.1,70,000, రూ.32వేలను ఎమ్మెల్యే వంశీ మోహన్ మంజూరు చేయించారు. ఆ చెక్‌లను శనివారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటూరి సరళ, ఉప సర్పంచ్ కటకోటి బ్రహ్మానంద రెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్, సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, కోటేశ్వరావు పాల్గొన్నారు.

రక్తహీనత, పౌష్టికాహారం లోపంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: రక్తహీనత, పౌష్టికాహారం లోపం వల్లే కలిగే ఆరోగ్య సమస్యలపై బాలికలు, బాలింతలు, గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యారోగ్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలు, బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రక్తహీనత వల్ల మాతృ, శిశు మరణాలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు పూర్తయిన బాలికలకు మాత్రమే వివాహం చేయాలని సూచించారు. సర్పంచ్ పిల్లా అనిత, పంచాయతీ కార్యదర్శి శ్యామలరావు, ఏఎన్‌ఎంలు కమల కుమారి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, హేమలత, వీర నాగమణి, శివలీలా, ఇందిరా కుమారి పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి



గన్నవరం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం సర్వశిక్ష అభియాన్ సీఎంఓ బీ గోపాలరావు సందర్శించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు, ఎంఐఎస్, కార్యాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నాడు–నేడు పనులకు సంబంధించిన బిల్లులను హెచ్‌ఎంలతో కలిసి ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

దివ్యాంగుల పాఠశాలకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి దివ్యాంగులకు ఆశ్రయం కల్పిస్తున్న పాఠశాలలకు దాతలు అండగా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీ, ఆదిత్య బధిరుల విద్యాలయాలకు శనివారం ఆయన రూ.15 వేలు సాయం అందించారు. ఆయన సతీమణి సుశీల జ్ఞాపకార్థం వితరణ ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కాకుల సుబ్బారావు, కార్యదర్శి మాకినేని శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు మేడికొండ బుచ్చిబాపయ్య, లింగంనేని రాజారావు, నందిగం స్వామి, అక్కినేని ఫణీంద్ర పాల్గొన్నారు.

లద్దె పురుగు నివారణకు చర్యలు

గన్నవరం: మండలంలోని బుద్ధవరం గ్రామంలోని మినుము పైరును శనివారం జిల్లా వనరుల కేంద్రం అధికారులు సందర్శించారు. మినుము పైరులో పొగాకు లద్దె పురుగుల ఉనికిని గుర్తించిన అధికారులు సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ కె. జ్యోతిరమణి మాట్లాడుతూ పొగాకు లద్దె పురుగు నివారణకు పంట పూత దశకు ముందు 20 నుంచి 25 రోజుల్లో వేపనూనె పిచికారీ చేయాలని తెలిపారు. పురుగు తొలి దశలో ఒక ఎంఎల్ చొప్పున చొప్పున, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే స్పైనోసాడ్ 0.3 ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కలుపు నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

పీడీ జగదీశ్వరికి అభినందన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ జగదీశ్వరీను శనివారం పాఠశాల హెచ్‌ఎం తాయారు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. గుంటూరులో ఈ నెల ఆరోతేదీ జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్ త్రోలో రెండో స్థానం, హ్యామర్ త్రోలో మూడో స్థానాన్ని జగదీశ్వరీ సాధించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

పేరంటాలమ్మ ఆలయం ముస్తాబు

ఐదురోజులపాటు సంక్రాంతి సంబరాలు



ఉత్సవాలకు సిద్ధమైన పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: జిల్లా వ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు సంతరించుకున్న రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం సంక్రాంతి ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం వైభవంగా నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలను ఈ సంవత్సరం కోవిడ్ నిబంధనలను పాటిస్తూ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలు, తాగునీటి వసతి, మొక్కుబడులు నిర్వహించుకునేందుకు వీలుగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు సౌకర్యాల కల్పనపై ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12న సాయంత్రం అమ్మవారి పుట్టింటి వారసులచే పసుపు, కుంకుమ, నూతన వస్త్రాల బహూకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు, ఈ నెల 13 నుంచి 18వ తేదీవరకు నిరాటంకంగా సంక్రాంతి సంబరాలు వైభవంగా జరుగుతాయి.

ఐదు రోజులు సందడే సందడి

ఈ ఉత్సవాలకు రాష్ట్రంలో ఏ మూలనున్న పలు గ్రామాల్లోని కొత్త అల్లుళ్లు, కూతుళ్లతో పాటు బంధుమిత్రులు తప్పనిసరిగా హాజరై సందడి చేస్తారు. నాల్గు రోజుల పాటు జరిగే అమ్మవారి గ్రామోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొంటారు. ఈ జాతరను పురస్కరించుకుని ఒక పక్క ఆట వస్తువులతో కూడిన దుకాణాలు, మరో పక్క జెయింట్ వీల్, కొలంబస్, వీల్‌చైర్, మ్యూజిక్ చైర్స్ వంటి వినోదాలు పంచే ఎగ్జిబిషన్‌తో సందడి నెలకుంటుంది.

క్రీస్తు అడుగుజాడల్లో పయనించాలి



ఉపదేశం చేస్తున్న ఫాదర్ సాల్మన్‌రాజు



దివ్యపూజా బలిని సమర్పిస్తున్న ఫాదర్ ప్రవీణ్

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ కుటుంబంగా కలసి క్రీస్తు అడుగుజాడల్లో పయనించాలని ఏలూరు జిల్లా జానంపేట బ్రిందిసి భవన్ రెవ.ఫాదర్ దొడ్డ ప్రవీణ్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాల్లో భాగం నవదిన ప్రార్థనలు శనివారం నాలుగో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక దివ్య పూజా బలిని సమర్పించి శ్రీసభ క్రైస్తవుల సమూహ ప్రయాణం అనే అంశంపై ప్రసంగించారు. శ్రీసభ ఒక కుటుంబంగా కలసి క్రీస్తు అడుగుజాడల్లో ప్రయాణం చేయాలని సూచించారు. ఈ ప్రయాణం విజయవంతం కావాలంటే అందిరనీ కలుపుకుంటూ ఒకరికి ఒకరు కలసి చర్చించి, మంచి నిర్ణయాలు తీసుకుని ఆచరణాత్మకంగా జీవించాలన్నారు. ఫాతిమానగర్ సంఘస్తులు కొనియాడారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్ ప్రజల విన్నపాలు చదివి, వారి ఉద్దేశాల కోసం ప్రార్థించారు. మేరిమాత ప్రావిన్షియల్ కాసు కరుణాకర్, ఫాదర్లు బసంత్, మరియన్న, శౌరిరెడ్డి, ప్రవీణ్, జోసఫ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కంకిపాడు: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆరోగ్య మాతా దేవాలయం కంకిపాడు విచారణ గురువు ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు సూచించారు. ఈ ఏడాది మొదటి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు స్థానిక ఆరోగ్య మాతా దేవాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. విచారణ పరిధిలోని 17 గ్రామాల నుంచి క్రీస్తు విశ్వాసులు ప్రార్థనలకు హాజరయ్యారు. ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు దివ్యబలిపూజ సమర్పించి క్రీస్తు సందేశం వినిపించారు.

ప్రాంగణ ఎంపికల్లో 12 మంది ఎంపిక



ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బెంగళూరుకు చెందిన కాడ్‌నెస్ట్ సంస్థ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 12 మంది ఎంపికయ్యారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో మొత్తం 259 మంది విద్యార్థులు పాల్గొనగా, రాత పరీక్షలు నిర్వహించిన పిమ్మట గ్రూప్ డిస్కషన్ ద్వారా 47 మంది ఎంపికయ్యారు. అనంతరం ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చిన 12 మందిని ఎంపిక చేశారు. వికాస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామ్మోహనరావు, బీవీ రమణ, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు బయలుదేరిన జట్లు



అథ్లెటిక్స్ పురుషుల, మహిళల జట్లు

విజయవాడరూరల్: ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్సిటీ చెన్నైలో నిర్వహించనున్న అఖిల భారతదేశ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయ పురుషుల, మహిళల జట్లు శనివారం నున్న వికాస్ కాలేజి నుంచి బయలుదేరినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల జట్టులో జి.పవన్‌కుమార్(కేవీఎస్ కళాశాల, విజయవాడ), డి.గోపిచంద్, బి.శివగంగ (డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల, ఇబ్రహీంపట్నం), వికె విషల్ (నలంద డిగ్రీ కళాశాల విజయవాడ), టి.బ్రహ్మారెడ్డి, ఎం.శ్రీకాంత్, ఎస్.సాయికుమార్, ఎన్ అవినాష్ (వికాస్ వ్యాయామ కళాశాల నున్న), వి.ప్రదీప్(పిబి సిద్ధార్థ కళాశాల విజయవాడ).

మహిళల జట్లు

అనగ లక్ష్మీ, బి.లావణ్య కేబీఎన్ కళాశాల, అబ్దుల్ గొషియా, డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల, ఎస్‌కే కరిష్మ, బి.సుప్రియ, వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న, ఎం.అనూష, ఎస్‌డీ ఎంఎస్ కళాశాల, విజయవాడ. బిందులత, ఏజీఎస్‌సీ కళాశాల , ఉయ్యూరు. ఈ పోటీలకు మేనేజర్‌గా డి.రత్నబాబు, కోచ్‌గా పి.బాలాజీ వ్యవహరిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లను కృష్ణా యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ కిరణ్ కుమార్, వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, సెక్రటరీ–కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి అభినందనలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. చెరువు సెంటర్, బోడపాడు, మ్యాంగోమార్కెట్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పైన పేర్కొన్న సమయంలో నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

18న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. శనివారం ఆమె వివరాలు తెలుపుతూ ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు ఆయా శాఖల అధికారులు మండల ప్రగతిపై నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.